www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 4 డిసెంబర్ 2024
5
అన్నమయ్య



'ఫెంగల్' బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ కారణంగా అన్నమయ్య జిల్లాలో ఎడ తెరపిలేని వర్షం కురిసిందని, ఫలితంగా పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజులు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, వరి, మొక్కజొన్న, అరటి, టమోట, చామంతి పూల తోటలు, బీన్స్ తదితర చేతికొచ్చిన పంటలన్నీ తడిసి ముద్దయ్యాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా జిల్లాలో 2233.5 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో మొక్క జొన్న నష్టపోయాయని, మొత్తం 76 గ్రామాలలో 2176 మంది రైతులు, రూ.1.54 కోట్లు పంటలు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. వాస్తవంగా ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నదన్నారు. సాగుచేసిన ప్రధాన పంట అయిన వరి ప్రస్తుతం కోత దశలో ఉందని, పూర్తిస్థాయిలో వరి పంట కోతలు పూర్తి కాలేదని, ఫెంగల్ తుపాను దాటికి వరి పంట నేల వాలి, నీట మునిగిందని తెలిపారు. ఈ సంవత్సరంలో వర్షాభావంతో వేరుశనగ రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెంగల్ తుపాన్ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులు పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో రెవెన్యూ సదస్సులు, సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు, పిజిఆర్‌ఎస్ అర్జీలు, నీటి పన్నుకు సంబంధించిన డేటా, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఏ తేదీలలో ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించబోతున్నామో ముందుగా ప్రకటన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. స్థానిక మంత్రి, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి, సమన్వయంతో సదస్సులను నిర్వహించాలని ఆదేశించారు. సిఎంఒ కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు, పిజిఆర్‌ఎస్ అర్జీలపై సమీక్షిస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నీటి పన్నుకు సంబంధించిన డేటాపై సమీక్షిస్తూ చాలా మండలాలలో డేటా ఎంట్రీ పూర్తి కాలేదని, వీఆర్‌ఒలకు సరైన శిక్షణ ఇప్పించి ఈ పనిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధానం, నీటి పన్ను మాడ్యూల్‌పై ఈనెల 4న వీఆర్‌ఒలకు శిక్షణ నిర్వహించాలని డిఆర్‌ఒకు సూచించారు. సర్వే రాళ్లపై ఉన్న బొమ్మలను ఎటువంటి లోపాలు లేకుండా తొలగించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ శాఖలన్నీ పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో త్వరలో ముఖ్యమంత్రి నిర్వహించనున్న కలెక్టర్ల సమావేశంలో అన్నమయ్య జిల్లాకు సంబంధించిన ప్రాధాన్యతలు, రూపొందించాల్సిన ప్రణాళికలు, చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల సమర్పించిన నివేదికలపై సమీక్షిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని, వాటిని అర్థం చేసుకొని జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. వచ్చిన లక్ష్యం ఎంత, సాధించింది ఎంత, ఎక్కడ వెనుక పడ్డాం, అందుకు గల కారణాలు, లక్ష్యసాధనలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని అధిగమించి ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులు, ఆదాయం పెంచే మార్గాలు తదితరాలపై స్పష్టమైన సమగ్ర ప్రణాళికలతో నివేదికలను తయారు చేయాలన్నారు. గత కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మరో కలెక్టర్ల సదస్సు ఉంటుందని, దీనికి అనుగుణంగా నిర్దేశించిన లక్ష్యాలను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సిపిఒ వెంకట పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛా జలాశయానికి జలకళ

- పూర్తి స్థాయిలో నీటి నిల్వ



ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ఎట్టకేలకు పింఛా జలాశయం జలకళను సంతరించుకుంది. బంగాళాఖాతంలో నాలుగు రోజుల కింద ఏర్పడిన ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా 0.327 ఎంసిఎఫ్‌టి సామర్థ్యాన్ని సంతరించుకుంది. అన్నమయ్య జిల్లా బాహుదానదిపై పింఛా రిజర్వాయర్ నిర్మితమైంది. 2020 నవంబర్ 19న సంభవించిన జవాద్ తుపాన్ ధాటికి రిజర్వాయర్ మట్టికట్టలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం జిల్లా నీటిపారుదల శాఖ సుమారు రూ.62 కోట్లతో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపించింది. అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా నీటి పారుదల శాఖ మట్టికట్టల పునరుద్ధరణ పనులు చేపట్టింది. మూడేళ్ల వ్యవధిలో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసింది. ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా జలాశయం మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో నిండిపోయింది. అనంతరం నిల్వ చేసిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేసింది.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- నేర సమీక్ష సమావేశంలో ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు. బహిరంగ మద్యపానంపై ముమ్మరంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు సందర్శిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల చేదనకు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. చోరీ కేసుల్లో సొత్తును త్వరితగతిన రికవరీ చేయాలని, రికవరీ చేసి బాధితులకు అప్పజెప్పాలని, అనుమానాస్పద మృతి కేసులు, సైబర్ నేరాలు, పోక్సో, రేప్ కేసులు, మహిళలపై నేరాల కేసులలో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గంజాయి కేసులు, ఎస్‌సి, ఎస్‌టి కేసుల మీద ప్రతి ఒక్క అధికారులను (రాయచోటి, మదనపల్లి, రాజంపేట) సబ్ డివిజన్ వారిగా అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య, ఇతర కీలకమైన కేసుల్లో శాస్త్రీయ పద్ధతులలో దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని, మహిళల, చిన్నారుల అదృశ్యం కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సేదించాలని ఆదేశించారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులకు న్యాయం చేయాలని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్ధాలను, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువగా నమోదుచేయ్యాలని, రోడ్డు భద్రతపై వాహన దారులకు అవగాహన కల్పించాలని, వారికి హెల్మెట్ సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజెప్పాలని సూచించారు. దాడులు ఉధృతం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ లను త్వరితగతిన అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాయచోటి, మదనపల్లి, రాజంపేట డిఎస్‌పిలు ఎం.ఆర్.కృష్ణమోహన్, డి.కొండయ్య నాయుడు, ఎన్.సుధాకర్, జిల్లాలోని సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'సంఘీభావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేరళ ప్రజల హక్కులు పరిరక్షించాలని, ప్రత్యామ్నాయ వామపక్షాలను బలోపేతం చేయాలనే నినాదంతో దేశవ్యాప్తంగా సిఐటియు, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బిజెపి కక్ష పూరిత విధానాలను ప్రచారం చేస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పి.మణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా బిజెపి యేతర ప్రభుత్వాల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ముఖ్యంగా కేరళలోని సిపిఎం నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు అడ్డంకులు కల్గిస్తోందని తెలిపారు. చట్టపరంగా రావాల్సిన నిధులు ఇవ్వకపోవడమే గాక గవర్నర్‌ను అడ్డంపెట్టుకుని కేరళ రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను తొక్కిపెడుతూ కేవలం సుప్రీం కోర్టు జోక్యంతో అరకొర నిధులు ఇస్తున్నారని తెలిపారు. కేరళలోని భారత పెట్రోలియం లాంటి భారీ పరిశ్రమను అమ్మకానికి సిద్ధ పడగా కేరళలో సంవత్సరం పాటు ఆందోళన చేస్తే కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. త్రివేంద్రం విమానాశ్రయాన్ని అదానికి అప్పజెప్పిందని తెలిపారు. కేరళలో తీవ్ర వర్షాల వల్ల వయనాడ్‌లో కొండచరియలు విరిగి 400 మంది చనిపోవడమే గాక నాలుగు జిల్లాలు పూర్తిగా నీటి మట్టమయితే కేరళ ప్రభుత్వంతో పాటు దాతలు, ఇతర రాష్ట్రాల ప్రజల విరాళాలిచ్చి ఆదుకున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా పరిగణించి కనీస సహకారం ఇవ్వలేదని తెలిపారు. కేరళ ప్రభుత్వానికి పరిమిత వనరులే ఉన్నప్పటికీ కనీసవేతనం రోజుకు రూ.600 అమలు చేయడంలో 30 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసిందన్నారు. అన్ని రంగాల కార్మికులకు వేతనాలతోపాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసుందని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో విద్య, వైద్యం, ఆరోగ్యం లోటు లేకుండా కృషి చేసిన కేరళను ఐక్యరాజ్యసమితి కొనియాడిందని చెప్పారు. అటువంటి కేరళను కేంద్రం నిధులివ్వకుండా అభివృద్ధికి ఆటంకపరుస్తున్నందుకు ఈ నెల 11న దేశవ్యాప్తంగా కేరళ సంఘీభావ దినంగా బిజెపికి వ్యతిరేకంగా చేపట్టే నిరసనలు, ఆందోళనలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి, రైతులు బషీర్ ఖాన్, అహమ్మద్, రెడ్డెయ్య పాల్గొన్నారు.



నూనెవారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన కంచెను పరిశీలిస్తున్న తహశీల్దారు, ఎస్ఐ

పింఛా నది రోడ్డులో రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, బాలంవారిపల్లి పంచాయతీ, నూనేవాండ్లపల్లి - ఒంటేరు వాండ్లపల్లి మార్గంలోని పింఛా నది రోడ్డుపై వాహనాలు, పాదచారుల రాకపోకలను తాత్కాలికంగా నిషేధించినట్లు పీలేరు మండల తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గార్గేయనది (పింఛానది) ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటితో నది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో ఈ మార్గంలో రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రజా రక్షణా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని అన్నారు. మంగళవారం స్థానికులను హెచ్చరిస్తూ నదిలోని రోడ్డును ఎవరూ దాటడానికి వీలు లేకుండా నది ఒడ్డుకు ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా, రాకపోకలను నిషేధిస్తూ కంచెను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బాలకృష్ణ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు కోసం ఆయా శాఖల మంత్రులకు వినతి

ప్రజాశక్తి -రాయచోటి

రాయచోటి నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంగళవారం రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయా శాఖల మంత్రులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ద్వారా గాలివీడు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురంలోని గ్రామీణ ప్రాంతాలకు శుద్ధి చేసిన నీటిని అందించేందుకు రూ. 8.90 కోట్లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను లేఖలో కోరారు. రాయచోటి నియోజకవర్గం వ్యాప్తంగా విద్యుత్ అవసరాల కోసం 33/11 కె.వి.సామర్థ్యం కలిగిన 10 విద్యుత్ ఉప కేంద్రాలను మంజూరు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను, రాయచోటి నియోజకవర్గంలో ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా 40 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం ద్వారా ఆలయాల జీర్ణోద్ధరణకు టిటిడి నిధులు మంజూరు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో మైనార్టీ సంక్షేమంలో భాగంగా షాది ఖానా నిర్మాణం కోసం రూ. 2.5 కోట్లు, రాయచోటిలో మరో రూ. 2.5 కోట్లు మంజూరు చేయాలని మైనార్టీ న్యాయశాఖ మంత్రి మహ్మద్ ఫరూక్‌ని, రామాపురం మండలం గువ్వల చెరువు వద్ద పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలని హోంశాఖ మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం రూపురేఖలు మార్చాలనే ఒక దృఢ సంకల్పంతో వివిధ అభివృద్ధికి పనులకు బాటలు వేస్తున్నామన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఒక మంచి గుర్తింపు తీసుకొస్తామని చెప్పారు.

వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం: వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్భాటంగా హామీలు ఇచ్చేసి, ఆరు నెలలు కావస్తున్నా హామీలను అమలు చేయకుండా విస్మరిస్తుండడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామం నుంచి ప్రతి వైసిపి కార్యకర్త సైనికుడిలా పని చేసి, కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్రమణ, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, ద్వారక, రవీంద్రా రెడ్డి, చెంగల్ రెడ్డి, సాంబ శివ, ప్రియరంజన్ రెడ్డి, మోహన్ రెడ్డి, నీళ్లభాస్కర్, సుధాకర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాయచోటి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అన్నమయ్య జిల్లాలోని 6 నియోజక వర్గాలల్లో 7 స్కిల్ హబ్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆలోచన విధానంతో చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతి యువకుల కోసం స్కిల్ హబ్ సెంటర్ ద్వారా శిక్షణఇచ్చి ఉపాధి కల్పించడం కల్పించడమే స్కిల్ హబ్ సెంటర్ల ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో ఉన్నటువంటి వనరులు, డిమాండును దృష్టిలో పెట్టుకొని యువతకు బాగా డిమాండ్ ఉన్నటువంటి కోర్సుల్లో మూడు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి అలాగే వారికి స్థానికంగా ఉన్నటువంటి పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇతర రాష్ట్రాలలో కూడా అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ఆసక్తి, శ్రద్ధ, ఉన్నటువంటి యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9603770097లో సంప్రదించాలన్నారు.

ఎస్‌సి హాస్టళ్లు, కెజిబివిలకు మహర్దశ : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కెజిబివిలకు మహర్దశ పట్టిందని, వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి రూ.416.96 లక్షలు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భవనాలలోని వసతి గృహాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారున్నారు. సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను అసలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వసతి గృహాలలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాయచోటి నియోజకవర్గంలోని వసతి గృహాల పరిస్థితులను, వసతుల లేమిని చూసి వాటిని అభివృద్ధి చేయాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ మేరకు రాయచోటి నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ భవనాలలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఉన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు రూ.416.96 లక్షల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని జికె. రాచపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం, గాలివీడు, నీలకంఠ రావుపేట, సంబేపల్లి తదితర వసతి గృహాలలోని పరిస్థితులను చక్కదిద్దుతామని తెలిపారు. నియోజకవర్గంలోని కెజిబివిల అభివృద్ధికి రూ.2.52 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కెజిబివి పాఠశాలల్లో అనేక సమస్యలున్నాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని 6 పాఠశాలల్లో 11 పనులకు గాను రూ.2.52 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం, గాలివీడు, సంబేపల్లి మండలాలలోని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఆర్ట్ క్రాఫ్ట్ రూములు, మేజర్, మైనర్ మరమ్మతులు, ప్రహరీ పనులను చేపడుతామని మంత్రి పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవు : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి పాలనలో అవినీతి, అక్రమాలకు తావులేదని, ఎమ్మెల్యే షాజహాన్ బాషపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెలుగుదేశం నాయకులు హెచ్చరించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మదనపల్లె టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పోతబోలు సుధాకర్, ముసలికుంట నాగయ్య, చల్లా నరసింహులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తహశీల్దారు అవి నీతిపై వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తే, మదనపల్లి తహశీల్దారుకు వత్తాసు పలుకుతూ వైసిపి నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. అవినీతి అధికారులకు కొమ్ము కాస్తూ ఐదు నెలలుగా బయటకు రాని వైసిపి ఇన్‌ఛార్జి ప్రెస్‌మీట్ల కోసం మాత్రమే బయటకొచ్చి మాట్లాడే నిస్సార్ అహమ్మద్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే టిడిపి కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యేపై అర్థరహిత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో సంగం శ్రీనివాసులు, రాటకొండ మధుబాబు, సర్పంచ్ మధు, టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు మహర్షి, జెసిబి మధు, షంషీర్, నాగూర్ వలి, గిరీష్, తమ్మిశెట్టి రామకృష్ణ, జాఫరున్నిషా, హసీనా, కురవంక ఉప సర్పంచ్ భారతి, నవీన్ చౌదరి, రైస్ మిల్ శశి కుమార్, బాలమాలి శేఖర్, దుబ్బిగాళ్ల భాస్కర్, మంజునాథ్ పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

21, 22వ తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మదనపల్లిలో ఈ నెల 21, 22 తేదీల్లో ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ 55 సంవత్సరాల తర్వాత మహాసభ నిర్వహించబోతున్నమని అన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్ కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని చెప్పారు. మహాసభలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ, భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. విద్యావేత్తలు, అభ్యుదయవాదులు ,శ్రేయోభిలాషులు అందరూ మహాసభ జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, రాయచోటి ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు గురునాథ్, సాయి చరణ్ ఉపాధ్యక్షుడు పవన్ నాయుడు, రాజేష్, బాలాజీ, నాగేంద్ర, అరుణ్, విష్ణు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వయోజన విద్యా భారం నుంచి మినహాయించాలి

- సిడిపిఒలకు అంగన్వాడీల వినతి



మదనపల్లె : సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వయోజన విద్యా కార్యక్రమం నుంచి అంగన్వాడీలను మినహాయించాలి మంగళవారం సిడిపిఒకు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి మధురవాణి రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీలను వయోజన విద్య వాలంటీర్లుగా పనిచేయాలని అధికారులు చెపుతున్నారన్నారు. అంగన్వాడీలకు ఇప్పటికే పనిభారం ఎక్కువగా ఉందన్నారు. యాప్స్‌లో పని చేయాలని, అంగన్వాడీకి సంబంధించిన రిజిష్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రీస్కూలు అభివృద్ధికి టైం టేబుల్ ప్రకారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హరీంద్రశర్మ, అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** అంగన్‌వాడీలపై వయోజన విద్యా భారం మోపడం తగదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తమపై వయోజన విద్య భారాన్ని మోపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ పనులు ఎక్కువ అయ్యాయని, ఇలాంటి సమయంలో వయోజన విద్య భారాన్ని మోపడం సరికాదన్నారు. ఫ్రీ స్కూల్ కార్యక్రమాలకు పూర్తి న్యాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రావతి, భూకైలేశ్వరి, దేవసేన, బుజ్జమ్మ, గులాబ్‌జాన్, గాయత్రి, సంపూర్ణ, నజీమున్నిసా, నారాయణమ్మ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** వయోజన విద్యా వాలంటీర్లుగా బాధ్యతలు మాకొద్దని అంగన్వాడీ కార్యకర్తలు సిడిపిఒ పద్మావతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి మాట్లాడుతూ అదనపు బాధ్యతలు అంగన్వాడీలకు వద్దన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, ప్రభావతి, రుక్మిణి, శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



అన్నమాచార్య యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాప కురాలుగా పనిచేస్తున్న పోలిచెర్ల చెంగమ్మకు జె.ఎస్. యూనివర్సిటీ, షికోహాబాద్ యూని వర్సిటీ, ఉత్తరప్రదేశ్ వారిచే పిహెచ్‌డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి. నారాయణ తెలిపారు.ఎక్స్ ప్లోరింగ్ ది ఇంపేక్ట్ ఆఫ్ ఎఐ ఆన్ రిమోట్ వర్క్ ఎఫిషి యన్సీ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారని, ఆమె జెఎస్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు దుగ్గిరాల ఆధ్వర్యంలో పిహెచ్‌డి చేశారని చెప్పారు. పరిశోధన నిరుద్యోగులకు రిమోట్ వర్క్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించ డానికి ఉపయోగపడుతుందని పోలిచెర్ల చెంగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్ర్ ఎన్.మల్లిఖార్జునరావు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు పోలిచెర్ల చెంగమ్మను అభినందించారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు : డిఎఒ



పీలేరు : వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

ప్రజాశక్తి-పీలేరు

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ తెలిపారు. మంగళవారం పీలేరు వ్యవసాయ డివిజన్ లోని కెవి పల్లి మండలం, గర్నిమిట్ట రైతు సేవా కేంద్రం పరిధిలోని మల్లారపువాండ్లపల్లిలో పొలం పిస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంటలో నాణ్యమైన అధిక దిగుబడులకు ఎకరాకు 200 కేజీల వంతున జిప్సం వాడాలని, వరి పంటలో వ్యాధి నిరోధక శక్తి వృద్ధికి పొటాష్ తప్పక వాడాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ సాయం కోసం రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్ లో నమోదు చేయించుకుని, వేరుశనగకు రూ.96, వరికి రూ.126, టమోటాకు రూ.1600లు వంతున మీసేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించి, బీమా సౌకర్యాన్ని పొందాలని అన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతూ విధిగా ఇ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రము శాస్త్ర వేత్త మంజుల రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంట సాగులో క్రొత్త వంగడాల సాధన, విత్తనశుద్ధి గురించి తెలియచేశారు. పీలేరు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైవి రమణారావు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతోపాటు రబీ పంట సాగుకు ఉపయోగపడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు యు. శ్రావణి, హెహన్, కరుణాకర్, శాస్త్ర వేత్తలు మంజుల, పీరూనా యక్, వ్యవసాయ విస్తరణాధికారులు కె. అనితాదేవి, ఇంద్రసేనా రెడ్డి, అల్తాఫ్, విఎఎ అనిల్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి పంటకు ఇ-పంట నమోదు చేసుకోవాలి

నిమ్మనపల్లె: రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఇ-పంట లో నమోదు చేసుకోవాలని మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివశం కర్ తెలిపారు. నిమ్మనపల్లి మండలం లో పర్యటించిన ఆయన తవళం, నిమ్మనపల్లె-2 రైతు సేవ కేంద్రం పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, కెవికె శాస్త్రవేత్తలు సోమశేఖర్, శ్రీనివాసులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజనకు సంబంధించి పంట సాగు చేసిన ప్రతి రైతు తమ పంట ఇ-పంటలో నమోదు చేసుకోవాలన్నారు. వరి సాగులో అధికారుల సూచనలను పాటించాలని అన్నారు. వరి నాటేముందు జనుము, జిలుగా, పచ్చిరొట్ట ఎరువులు వేసి పొలాన్ని దున్నుకోవాలన్నారు. వరి నాటిన నుంచి 55 రోజుల మధ్యలో 20 కిలోల పొటాష్ ను వేసుకుంటే, వరిలో వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధి చెంది, వరికాండం బలంవంతంగా ఉంటుందన్నారు. తద్వారా గాలి వలన తొందరగా పంట నేల వాడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఫెంగల్ తుఫాను కారుణంగా నేల వాలిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రంలో లభ్యమయ్యే ఎరువు లు, పంటల సాగు పద్ధతులుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీ మోహన్, కేవీకే శాస్త్రవేత్తలు సోమశేఖర్, శ్రీనివాసులు, ఏఈఓ లక్ష్మీ ప్రసన్న, విఏఏ శ్రీకాంత్,రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామాపురం : ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఇ-పంట నమోదు చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచా యతీ కన్నుపువాండ్లపల్లి, సరస్వతి పల్లి గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు రైతు సేవ కేంద్రాలలో ఇ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తు న్నందు వల్ల వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. వరి పొలాల్లో నీరు నిలువ లేకుండా కాలువలు తీసి బయటికి పంపాలని సూచించారు. వర్షంలో తడిసిన వరి పొలంలో గింజలు రంగు మారకుండా ఉండేందుకు కార్బండిజా 1గ్రా మంకో జెడ్ 2గ్రా లీడర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలాన్నారు. డిసెంబర్ 15 లోపు టమోటా సాగు చేసుకొని రూ.1600 ప్రీమియం చెల్లించిన రైతులకు ఎకరానికి రూ.32వేల పంటలు బీమా వర్తిస్తుందని అన్నారు. కార్యక్ర మంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి, మురళీధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటలు పెంచాలి

పుల్లంపేట: రైతులు తమ పంట పొలాలలో సాగు చేసే ముందు తరువాత రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించినట్లయితే మంచి దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పివిజి పల్లి, అనంతయ్యగారిపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయంపై పలు ముఖ్యమైన సలహాలు, సూచనలు, మెళకువలు తెలియజేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలోనే అవగాహనతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న పైరు రోగాల బారిన పడకుండా మందులు పిచికారి చేస్తే పంట దిగుబడి బాగా వస్తుందని రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంవైపు రైతులందరూ ఆసక్తి చూపాలని కోరారు. రసాయనిక ఎరువులను వినియోగం తగ్గిస్తూ సేంద్రీయ విధానాన్ని అవలంబించాలని అన్నారు. నాణ్యమైన పంటను పొందటానికి ఈ సేంద్రియ విధానం ఎంతగానో మేలు చేస్తుందన్నారు.కార్యక్రమంలో ఇంద్రజ, ప్రభాకర్ సునీతదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో నష్ట నివారణ

కలికిరి : తుపాను బాధిత రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టలను తగ్గించవచ్చునని కెవికె కలికిరి కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల రైతులకు సూచించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అక్కడక్కడ పండిన వరి పడిపోయి రైతులకు పంట నష్టం వాటిల్లిందని, ఇలాంటి పొలాలు మనుషులతో కోత కోయిస్తే బాగుంటుందని తెలిపారు. రబీ వేరుశనగ విత్తుకోవడానికి ఈ వర్షాలు అనుకూలమని తెలిపారు. టమోటా, మిరప, బొప్పాయి, ఉల్లి మొదలగు తోట పంటల్లో అక్కడక్కడ నీరు నిలవడం గమనించామని, ఈ నీటిని వీలైనంత త్వరగా పొలాల్లో నుంచి తీసివేయాలని సూచించారు. డ్రిప్పు ద్వారా జీవ శిలీంద్రనాశినులైన ట్రైకోడెర్మా, సుడోమోనాస్ మందులను ఎకరానికి ఒక లీటరు చొప్పున ఈ పంటలకు అందించాలని తద్వారా వేరుకుళ్ళు తెగులు, ఆకు ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునని అన్నారు. టమోటోలో బ్యాక్టీరియా మచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే నివారణగా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు 0.2 గ్రాములు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసి నివారించవచ్చునని తెలిపారు.


నిమ్మనపల్లి : వరి పంటను పరిశీలిస్తున్న ఎడిఎ


కలికిరి: దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు


రామాపురం: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు


టిడిపి నాయకులకు సమస్యలను వివరిస్తున్న ప్రిన్సిపల్

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారని, ల్యాబ్ పరికరాల కొరత ఉందని ఆయన దృష్టి తీసుక వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న నాగ శివశంకర్‌రెడ్డి

బాధితుడికి రూ.20 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ, అయ్యలరాజుపల్లె దళితవాడలో నివాసముంటున్న దాసరి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న నాగ శివశంకర్‌రెడ్డి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా దాసరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూడా కూలిపోయి నానా అవస్థలు పడుతున్న తమ కుటుంబ కష్టాలు తెలుసుకొని ఆర్థిక సాయం అందించిన నాగ శివశంకర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాణ్యం చిన్నయ్య, మీసేవ చంగల్ రాయుడు, రఘు, సుబ్బన్న పాల్గొన్నారు.

డిసిసి బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఏపి కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఈనెల2 నుంచి 8వ తేదీ వరకు డిసిసి బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిసిసి బ్యాంక్ ఉద్యోగి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసిసి బ్యాంకులో సీనియర్ సిటిజనులకు 666 రోజులకు 8.35 శాతం వడ్డీ, సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తుందని తెలిపారు. బంగారు ఆభరణాలు స్థిరాస్తి తాకట్టు గ్రామీణ,పట్టణ గృహ నిర్మాణాలు, చిరు వ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఖాతాదారులు బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలోవెంకటసుబ్బయ్య, రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.



డిఆర్ఎం విజయకుమార్‌ను సన్మానిస్తున్న భరత్ కుమార్‌రెడ్డి

రైల్వే రాకపోకలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి పనులు సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కాకపోవడంతో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కరోనా ముందు నిలుపుదల చేసిన పలు రైళ్లను పునరుద్ధరణ చేయాలని గుంతకల్ రైల్వే డిఆర్ఎం విజయ్ కుమార్‌ను కోరినట్లు డిఆర్‌యుసిసి సభ్యులు తెల్లం భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డిఆర్ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వేకోడూరు రాజంపేట వద్ద ఎల్‌సి గేట్ నెంబర్ 87 అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. కుక్కల దొడ్డి గ్రామంలో రైల్వే ట్రాక్ వద్ద ఉన్న ఎస్‌టి భూములకు విద్యుత్ తీసుకు నేందుకు అనుమతి ఇవ్వాలని డిఆర్ఎంను కోరినట్లు తెలిపారు. రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో కరోనా ముందు నిలుపుదల ఇంటర్‌సిటీ ప్యాసింజర్, అరక్కోణం ప్యాసింజర్ లను నిలుపుదల చేయాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కుక్కల దొడ్డి సర్పంచ్ బండి వడ్డ పూర్ణయ్య, రమణయ్య, మహేష్ పాల్గొన్నారు.

ములకలచెరువు ఎస్ఐ గాయత్రి బదిలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు ఎస్ఐ గాయత్రి బదిలీ అయ్యారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటిఎంలో పనిచేస్తున్న ఎస్ఐ నర సింహుడును ములకలచెరువు ఎస్ఐగా నియ మించారు. బదిలీ అయిన వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రాజంపేట మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని టిడిపి మండల కార్యదర్శి గన్నేరు సుబ్బ నరసయ్య నాయుడు ఎంపిడిఒను కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వర ప్రసాద్‌ను కలిసి రాజంపేట మండల పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీలకు సిసి రోడ్లు మంజూరు చేయా లని, అభివృద్ధి పనులు చేప ట్టాలని కోరారు. కార్య క్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, మండ సుధీర్, సింగ వరపురం, పసుపులేటి పెంచలయ్య, హరి, వల్లి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించాలి


తంబళ్లపల్లి : కేక్ కట్ చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విభిన్న ప్రతిభావంత పిల్లలకు తల్లి దండ్రులు ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని, ప్రతి ఒక్కరూ ఆదరణ చూపాలని ఎంఇఒలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఎంఇఒల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విభిన్న ప్రతిభావంతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తల్లి దండ్రులు తమ పిల్లల లోపాల గురించి బాధపడకుండా భవిత కేంద్రంలో శిక్షణ తీసుకోవడం, ప్రభుత్వం యొక్క పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు రేఖ, శ్రావణి, ఫిజియో థెరపీ సరళ, తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ మైనుద్దీన్, తంబళ్లపల్లి దళితవాడ హెచ్‌ఎం సాంబశివ, పోర్డ్ నరసింహులు, సిఆర్‌పిలు సుధాకర్, బాలకృష్ణ, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్‌బివిడి సభా ప్రాంగణంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు సుబ్బనరసారెడ్డి అధ్యక్షతన ఎంఇఒ తిరుమలరావు చేతులమీదుగా కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు. వచ్చిన అవకాశాలను సద్విని యోగం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ రాజం పేట, పుల్లంపేట సంఘ సభ్యులతో కలిసి కేక్ కట్ చేయడం జరిగిందని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేస్తున్నామని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు స్వశక్తితో జీవనం సాగి స్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని సూచించారు. రాజం పేటలో 12న నిర్వహించే ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి జయశ్రీ, మండల విద్యాశాఖ అధికారి తిరుమలరావును ఆహ్వానించినట్లు తెలిపారు. రాజంపేట అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ ఈనెల 12న జరిగే కార్యక్రమానికి పార్లమెంటు స్థాయిలోని అన్ని మండలాల నుంచి విభిన్న ప్రతిభావంతులు పాల్గొని ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బిఐడి సభా కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, పుల్లంపేట ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, సభ్యులు ఆనంద్, శ్రీనివాసులు, జ్యోతీశ్వర్ నాయుడు, బాలాజీ సంఘ వాలంటీర్ మురళి, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ భాషా సెక్రటరీ వెంకట ప్రసాద్, షమ్మీ, సుబ్రహ్మణ్యం రాజు , శివ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ గురుమోహన్

లంచాలకు స్వస్తి చెబుదాం : ఇఒ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో లంచాలకు స్వస్తి పలుకుదామని ఇఒ గురు మోహన్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఆయన గ్రామ పంచాయితీ, గ్రామ ఉద్యోగులు, సిబ్బంది చేత తాము లంచాలకు దూరమని, తాము అవినీతి అక్రమాలకు పాల్పడకుండా, ఎవరి నుంచి కూడా ఎలాంటి లాభాపేక్షలను ఆశించకుండా ప్రజలకు సేవలు అందిస్తూ, ఉత్తమ ఉద్యోగులు సిబ్బందిగా ప్రజలకు చేరు అవుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయం బయట బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ అవినీతి రహిత గ్రామపంచాయతీ కార్యాల యంగా పీలేరు గ్రామపంచాయతీని తీర్చిదిద్దుతామన్నారు. తమ సిబ్బంది ఎవరూ లంచాలు తీసుకోకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని పేర్కొ న్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు టంగుటూరు విద్యార్థి

ప్రజాశక్తి-నందలూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 29,30 తేదీలలో గుంటూరులో జరిగిన రగ్బీ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలో మండలంలోని టంగుటూరు జడ్‌పి హైస్కూల్‌కు చెందిన జి.దిలీప్‌కుమార్ అనే విద్యార్థి ఎంతో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు స్టాండ్ బై నెంబర్ వన్‌గా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థి ఈనెల 25న పాట్నాలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్ లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు, ఉపాధ్యాయులు చాంద్ భాషా,మస్తానయ్య, రమేష్ బాబు, లక్ష్మీనారాయణ రెడ్డి, మోహన్ రాజు,లక్ష్మీదేవి, శశికళ, రజిని, నాగార్జున, బాదుల్లా, ఉపాధ్యాయులు, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందించారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని రైతులు ప్రజలు ఆయా గ్రామాలలో జరిగే రెవెన్యూ గ్రామ సదస్సులను సద్వి నియోగం చేసుకోవాలని తహశీల్దార్ జె. భాగ్యలత పేర్కొన్నారు. ఈ నెల 6న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అరవీడు గ్రామ సచివాలయం నందు రెవెన్యూ సదస్సు ప్రారంభమవుతున్నదని తెలిపారు. 10న వెలిగల్లు, 12న తూముకుంట 13న గాలివీడు-, గాలివీడు2, 17న గాలివీడు3, 182 తేదీ గో రాన్ చెరువు, 19న నూలివీడు, 21న సీసీపల్లి, 24న పందికుంట, 26న కొర్లకుంట తలముడిపి, 28న పూలికుంట జరుగుతుందన్నారు. జనవరి 2న గోపనపల్లి, 3న గరుగుపల్లి, 4న ప్యారంపల్లి, 7పఎగువగుటివీడు , 8న గుండ్ల చెరువు ఆయా గ్రామ పరిధిలోని గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలలో జరిగే గ్రామసభలను ఆ గ్రామ రైతులు ప్రజలు రెవెనూ సదస్సును సద్వేవినియోగం చే సుకోవాలని పేర్కొన్నారు.

వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి


కలకడ : ఉల్లాస్ కార్యక్రమానికి హాజరైన అంగన్వాడీలు, అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వయోజనులను విద్యావంతులగా తీర్చిదిద్దడమే వయోజనుల విద్య ఉల్లాస్ శిక్షణా కార్యక్ర మం ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉల్లాస్ వయోజనుల విద్య కార్యక్రమంపై ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి చలపతిరావు, ఎపిఎం మురళి, ఎపిఒ రమేష్, అంగ న్వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి లతో కలిసి వెలుగు సిసిలు, విఒఎ, సంఘ మిత్రలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరక్షరాస్యులలో అక్షరాస్యతను పెంచ డానికి గతంలో అక్షర తపస్మాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలు వయోజనులకు విద్యను అందిం చడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులకు కనీస విద్యను నేర్పించడం ద్వారా అక్షరాస్యత శాతాన్ని పెంపొందించవచ్చుని లక్ష్యంగా చేసుకొని కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిం దన్నారు. వయో జనులు విద్యను నేర్చుకోవడం ద్వారా వారి కుటుంబాలను సమాజంలో సమర్థవంతంగా నిలబెట్టడంతో పాటు, ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగగలరని, తద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పడ తాయని వివరించారు. సంఘ మిత్రలు వయోజనులకు ప్రాథమిక విద్యతోపాటు, సాంకేతికత, ఆర్థిక వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. మహిళల, చిన్నపిల్లల చట్టాలపై, నైతిక విలువలపై వారికి తెలియజేయాలని సూచించారు. మండలంలో 32 కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, ఒక్కొక్క కేంద్రంలో పదిమంది సభ్యులను ఎంపిక చేసి వారికి విద్యను అందించడానికి ఒకరిని నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం మురళి, ఎపిఒ రమేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాను లక్ష్మీదేవి, విఒఎలు, సిసిలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.**పుల్లంపేట:** ఉల్లాస్ కార్యక్రమంపై మండల స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జయశ్రీ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ పథకం లక్ష్యాలన్నారు. మార్చి 15వ వరకు ప్రతిరోజూ రెండు గంటలపాటు మొత్తం 200 గంటల బోధన నిర్వహించాల న్నారు. మూడేళ్ల పాటు జరిగే కార్యక్రమంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, విస్తరణ అధికారి ముత్తయ్య, ఎపిఎం, డిజిటల్ అసిస్టెంట్ నారాయణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.**వీరబల్లి :** నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ యోజన పథకం లక్ష్యమని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉల్లాస్ యోజన సమావేశం మండల అంగన్వాడీ కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 500 మంది స్వయం సహాయక సంఘ సభ్యులను గుర్తించి వారికి వలంటరీ టీచర్లతో అక్షర జ్ఞానం నేర్పించడం జరుగుతుందన్నారు.అంగన్వాడీ టీచర్ పరిధిలో 10 మంది అభ్యాసకులు ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఖాదర్‌వలి, వయోజన విద్యా సూపర్‌వైజర్ మాధావిలత ,అంగన్వాడీ సూపర్ వైజర్‌లు సరస్వతమ్మ, లలిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని ఉల్లాస్ వయోజన విద్యా కార్యక్రమాన్ని వెలుగు ఎపిఎం రెడ్డమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి అంగన్వాడీ కార్యకర్తలకు వెలుగు సిసిలు, విఒఎలు, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు వారికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. శిక్షణలో ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత, ఆరోగ్యం, ఎన్నికలు, మన బాధ్యత, గణితం, ప్రభుత్వ చట్టాలు, మా ఇంటి మహాలక్ష్మి , డిజిటల్ అక్షరాస్యత పాటు మన సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.**కలకడ:** స్థానిక ఎంపిడిఒ వాలంటరీ టీచర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, విఒఎలు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గతంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన శిక్షణ తరగతుల పాల్గొన్న వారిచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఎం, డిఆర్‌డిఎ వారి అధ్యక్షతన నిర్వహించినట్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో నిరక్షరాస్యులను అక్షరరాస్యులుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీరాజ్, ఐసిడిఎస్, పిఆర్‌టిఎ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉల్లాస్ యాప్ విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో సంఘమిత్రలతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం గంగాధర్, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఎఒ మహమ్మద్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాధమ్మ , ధనలక్ష్మి, కుసుమ, రాణి పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : మాట్లాడుతున్న ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని ఓ యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలోని టీఎం వ్యాలీ వద్ద మంగళవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపినవివరాల మేరకు.. కలికిరి పట్టణంలోని మెయిన్‌బజార్‌కు చెందిన అబ్దుల్ రహిమాన్ కుమారుడు బాపనపల్లి అష్రఫ్ (27) మంగళవారం ఉదయం మదనపల్లి వైపు నుంచి స్వగ్రామమైన కలికిరికి కారులో బయల్దేరాడని తెలిపారు. మార్గమధ్యంలో మండలంలోని చింతలవారిపల్లి పంచాయతీ టిఎం వ్యాలీ వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో అష్రఫ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ఇరుక్కుపోయిన అష్రఫ్ మృతదేహాన్ని జేసీబీ సహాయంతో బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.